కార్మికుల ప్రాణాలను కాపాడాలని టీబీజీకేఎస్ వినతి

జీఎం ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేస్తున్న టీబీజీకేఎస్ నాయకులు

గోదావరిఖని, జూలై 30: సింగరేణిలో జరుగుతున్న వరుస ప్రమాదాల నివారణకు పటిష్టమైన రక్షణ చర్యలు చేపట్టి, కార్మికుల ప్రాణాలను కాపాడాలని తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి సింగరేణి సీఎండీ బలరాంను కోరారు. ఈ మేరకు మంగళవారం గోదావరిఖనిలోని ఆర్జీ-1 జీఎం ఇన్‌చార్జికి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఈ రక్షణ సంవత్సరం ఏడు నెలల్లో ఐదుగురు కార్మికులు మృతిచెందారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా లభిస్తున్న అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకొని ప్రమాదాల నివారణకు కృషి చేయాలన్నారు. రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి, కేంద్ర నాయకులు పర్లపల్లి రవి, ప్రవీణ్, చెలుకలపల్లి శ్రీనివాస్, చల్ల రవీందర్‌రెడ్డి, ఆర్జీ-1 ఉపాధ్యాక్షుడు వడ్డెపల్లి శంకర్, దూట శేషగిరి, పల్లె సురేందర్, జనగామ మల్లేశ్, పులిపాక శంకర్, రొడ్డ సంపత్, శ్రావణ్ ఉన్నారు.

వరద తెచ్చిన వివాదం

జూలపల్లి, జూలై 30 : చీమలపేటలో వరద వివాదానికి దారి తీసింది. ఆలస్యంగా తేరుకున్న అధికారులు సమస్యను ఓ కొలిక్కి తెచ్చేందుకు మంగళవారం గ్రామాన్ని సందర్శించారు. ఇరువర్గాల మధ్య సయోధ్య కుదుర్చి చిక్కుముడి విప్పేందుకు ప్రయత్నించారు. మోటర్లు ఏర్పాటు చేసి వరద తొలగింపు చర్యలు చేపడతామని గ్రామస్తులకు హామీ ఇచ్చారు. వారం నుంచి ఎడతెరిపి లేని వానలకు వరద చేరి జీపీ వద్ద ఉన్న తారు రోడ్డు మునిగింది. వరద వెళ్లడానికి నిర్మించిన మోరీకి అడ్డంగా ఓ ఇద్దరు వ్యక్తులు నిర్మాణాలు చేపట్టారనే ఆరోపణలున్నాయి. నీటి తొలగింపు విషయం రెండు వర్గాల మధ్య చిచ్చురేపింది. దాదాపు రెండున్నర ఫీట్ల లోతు ఉన్న వరద నీటి నుంచి ప్రయాణికులు వెళ్లలేక అవస్థలు పడ్డారు. స్కూల్ బస్సులు వరద దాటపోవడంతో పిల్లలు చదువులు మానేశారు. చీమలపేట-ఎలిగేడు మధ్య రాకపోకలు స్తంభించిపోయాయి. ఇటీవల కలెక్టర్‌కు తొంటి బీరయ్య అనే రైతు తన రెండెకరాల వరి పంట బ్యాక్ వాటర్ కారణంగా మునిగిందనీ, రోడ్డుపై నిలిచిన వరద తొలగించాలని ఫిర్యాదు చేశాడు. ఇరువురు ఇంటి యజమానులు స్థలాలకు సర్వేయర్‌తో కొలతలు వేయించుకోవడానికి అంగీకరించారు. భవిష్యత్‌లో వరద సమస్య తలెత్తకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు అధికారులకు విజ్ఞప్తి చేశారు. ఇక్కడ ఎంపీవో అనిల్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి వేముల ప్రవీన్‌కుమార్ ఉన్నారు.

ఆగస్టు 10, 11తేదీల్లో ఖనిలో జాతీయ కళోత్సవాలు

గోదావరిఖని, జూలై 30: తారా ఆర్ట్స్ అకాడమీ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు సంకె రాజేశ్ వచ్చే నెల ఆగస్టు 10, 11 తేదీల్లో నిర్వహించనున్న జాతీయ కళోత్సవాలను జయప్రదం చేయాలని జాతీయ సమితి నాయకులు కే స్వామి, ప్రముఖ కళాకారుడు మేజిక్ రాజా కోరారు. గోదావరిఖనిలోని ప్రెస్‌క్లబ్‌లో మంగళవారం వారు మాట్లాడారు. సింగరేణి బిడ్డగా 25 ఏళ్లుగా కళాకారుడిగా, కళాసేవకుడిగా అనేక ప్రాంతాల్లో అవార్డులు అందుకున్న సంకె రాజేశ్ మన ఊరి ఘనతను చాటి చెప్పటానికి, సింగరేణి ఖ్యాతిని ప్రపంచానికి చాటిచెప్పడానికి ఈ కళోత్సవాలు నిర్వహిస్తున్నారనారు. బొగ్గు గనులకు నిలయంగా ఉన్న ఈ ప్రాంతంలో నల్ల వజ్రం అనే కీర్తి పురస్కారంతో సత్కరించుకునే కళోత్సవాలకు స్థానిక రాజకీయ, కార్మిక నాయకులు, తమ వంతుగా సహాయ సహకారాలు అం దించి ఉత్సవాలను జయప్రదం చేయాల ని కోరారు. ఇక్కడ మేకల శ్రీధర్ యాదవ్, కళాకారులు దామెర శంకర్, కనకం రమణయ్య, దయా నర్సింగ్, ఇనుముల రాజమౌళి, కాసిపాక రాజమౌళి, కొండ్ర రాధాకృష్ణ, చంద్రపాల్, మేజిక్ హరి, సోగాల వెంకటి, మేకప్ అంజయ్య, నరాల తిరుమలయ్య ఉన్నారు.

పౌరహక్కుల దినోత్సవం

కాల్వశ్రీరాంపూర్,జూలై30: పెగడపల్లిలో మంగళవారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. గ్రామంలో కుల వివక్ష చూపకుండా, కలిసిమెలసి ఉండాలని, తహసీల్దార్ జాహెద్‌పాషా సూచించారు. కార్యక్రమంలో డీటీ శంకర్, ఆయా శాఖల అధికారులు, గ్రామస్తులు, దళిత సంఘాల నాయకులు ఉన్నారు.

రెండో విడుతలో 13,401మందికి..

- రూ.లక్షన్నరలోపు రుణమాఫీ
- రేషన్‌కార్డు ప్రామాణికంతో అనేక సమస్యలు
- ఫిర్యాదుల స్వీకరణకు గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు
- టోల్ ఫ్రీ నంబర్ 18005995459

మాట్లాడుతున్న కలెక్టర్ కోయ శ్రీహర్ష

పెద్దపల్లి, జూలై 30(నమస్తే తెలంగాణ): తెలంగాణ సర్కార్ అమలు చేస్తున్న రుణమాఫీ రైతులను తీవ్ర ఇక్కట్లకు గురి చేస్తున్నది. మంగళవారం రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఇతర మంత్రులు, ఎమ్మెల్యేలు, రాష్ట్రఉన్నతాధికారులతో కలిసి రైతు రుణమాఫీ రెండో విడత నిధుల విడుదల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కలెక్టర్ కోయ శ్రీ హర్ష సమీకృత జిల్లా కలెక్టరేట్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. జిల్లా వ్యాప్తంగా మొదటి విడతలో 1లక్షవరకు తీసుకున్న 30,055మందికి రూ. 151.37కోట్లు విడుదల చేయగా.. తాజాగా మంగళవారం రెండో విడతలో 13,401మందికి రూ. 123.41కోట్ల రుణాలను మాఫీ చేసింది. ఇందులో లక్ష వరకు ఉన్న వారి రుణాలే ఇంకా మాఫీ కాకపోగా తాజాగా ప్రకటించిన రూ.1.50లక్షల రుణమాఫీ లోనూ అనేక మందికి మాఫీ కాలేదు. ఈ సందర్భంగా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడారు. జిల్లాలో రెండు విడుతలుగా మొత్తం 42,965 మంది రైతులకు రూ. 271 కోట్ల రుణమాఫీ సొమ్ము ప్రభుత్వం విడుదల చేసిందన్నారు. మొదటి విడత కింద లక్ష రూపాయల వరకు రుణమాఫీతో 29,725 రైతులలో దాదాపు 85శాతం మేర రుణాలు రెన్యువల్ చేసి రైతుల ఖాతాలలో నిధులు జమ చేసి రుణమాఫీ ఫలాలు అందించామని వెల్లడించారు. రెండో విడతలో లక్షన్నర రుణమాఫీ కింద జిల్లాలో ఉన్న 13వేలకు పైగా రైతులకు రూ. 122 కోట్లపైగా నిధులను ప్రభుత్వం విడుదల చేసిందని, వీటిని సైతం వచ్చే వారంలోగా పూర్తి స్థాయిలో పంపిణీ చేసేందుకు చర్యలు తీసుకున్నామని చెప్పారు. రుణమాఫీ పథకంపై రైతులు ఫిర్యాదు చేస్తే 30 రోజుల్లో పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లాలో ఫిర్యాదుల నమోదుకు ప్రత్యేకంగా కలెక్టరేట్ లో టోల్ ఫ్రీ నంబర్ సైతం ఏర్పాటు చేశామని చెప్పారు. రుణమాఫీ పథకంపై రైతులు తమ సందేహాలను 18005995459 టోల్ ఫ్రీ నంబర్ ద్వారా నమోదు చేయాలన్నారు. రుణమాఫీకి రేషన్ కార్డు తప్పనిసరి కాదని, రైతు కుటుంబాన్ని గుర్తించేందుకు ఒక ప్రామాణికంగా మాత్రమే రేషన్ కార్డును వినియోగిస్తున్నామని చెప్పారు. భూమి ఉన్న ప్రతి రైతు కుటుంబానికి రెండు లక్షల రూపాయల రైతు రుణమాఫీ పథకం అమలు అవుతుందన్నారు. 12 డిసెంబర్ 2018 నుంచి 9 డిసెంబర్ 2023 వరకు రైతులు నూతనంగా తీసుకున్న రుణాలు, రెన్యువల్ చేసుకున్న రుణాలు అసలు, వడ్డీ కలిపి రూ. 2 లక్షల వరకు మాఫీ అవుతాయన్నారు. రైతు కుటుంబానికి రెండు లక్షల కంటే అధికంగా రుణం ఉన్నట్లయితే కుటుంబంలోని మహిళ పేరు పై రుణాలు నిబంధనల మేరకు ముందుగా మాఫీ అవుతాయని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, ఎల్‌డీఎం ఎం.వెంకటేశ్, బ్యాంకర్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

32రకాల ఆటంకాలు..

జిల్లాలో మొదటి, రెండో విడుత రుణమాఫీ సందర్భంగా రైతుల నుంచి వచ్చిన ఇబ్బందులను జిల్లా అధికారులు గుర్తించారు. ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా 32 రకాల కారణాలతో తమకు రుణమాఫీ అందలేదని విజ్ఞప్తి చేస్తూ దరఖాస్తులు సమర్పించారు. ఇందులో 53 మంది రైతులకు సంబంధించిన రుణం ఆన్‌లైన్‌లో టూబీ ప్రాసెస్డ్, ఇన్‌వ్యాలిడ్ ఆధార్ నంబర్ పేరుతో 8మంది రైతులు, నో డేటా ఫౌండ్ పేరుతో 94మంది రైతులు, రిమిట్టెడ్‌గా 20మంది రైతులు, ఆధార్, రైతు ఖాతాలో పేరు సరిగా లేక 91మంది రైతులు, కుటుంబ సభ్యుల నిర్ధారణ లేక 136, ఈ రెండు కారణాలతో 6, ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని 2, సర్వీస్ పింఛన్ ఉందని 2, మినహాయింపు లేని ప్రభుత్వ ఉద్యోగి ఉన్నారని 2, పట్టాపాసు పుస్తకం లేదని 32, ఇతర కారణాలతో 64 ఇలా మొత్తంగా ఇప్పటి వరకు జిల్లాలో 510మందికి సంబంధించిన రుణాలను మాఫీ కాలేదని అధికారుల దృష్టికి వచ్చింది. వీటిలో అర్హులను గుర్తించేందుకు అధికారులు సమాయత్తం అవుతున్నారు.

బాధిత కుటుంబానికి న్యాయం చేయాలి

మాట్లాడుతున్న బీఆర్ఎస్ నాయకురాలు దాసరి ఉష

పెద్దపల్లి కమాన్, జూలై 30 : జిల్లా ప్రభుత్వ ప్రధాన దవాఖానలో సెప్టిక్ ట్యాంకులో బాలుడు పడి మృతి చెంది 20 రోజులు గడుస్తున్నా బాధిత కుటుంబానికి ఇప్పటి వరకు ఎలాంటి న్యాయం చేయలేదని బీఆర్ ఎస్ పార్టీ నాయకురాలు దాసరి ఉష ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన వలస కూలీ నీలం శ్రీను-రాములమ్మ దంపతుల కొడుకు జాన్ వెస్లీ పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానా ఆవరణలోని సెప్టిక్ ట్యాంకు పడి మృతి చెందాడని, బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించి, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని జిల్లా కలెక్టర్‌కు విన్నవించారు. మంగళవారం కలెక్టరేట్‌లో దాసరి ఉష వినతి పత్రాన్ని అందజేశారు. బాధ్యులపై చర్యలు తీసుకుని బాధితులకు తగు న్యాయం చేయాలని ఇప్పటికే పలుమార్లు కలెక్టర్‌కు విన్నవించినా తన పరిధిలోకి రాదని దాటవేసే ధోరణి అవలంబిస్తున్నారని పేర్కొన్నారు. కలెక్టర్‌పై చర్యలు తీసుకోవాలని సీఎస్ శాంతికుమారికి ఫిర్యాదు చేస్తామని అన్నారు.అలాగే దవాఖానలో జరిగిన సంఘటనపై మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి బాలుడి తల్లిదండ్రులకు న్యాయం చేస్తామన్నారు. కౌన్సిలర్ లైశెట్టి భిక్షపతి, బాధిత కుటుంబసభ్యులు నీలం శ్రీను, రాములమ్మ, నాయకులు ఉన్నారు.

రైతు రుణమాఫీ హర్షనీయం

మంథని, జూలై 30: రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ చేయడం హర్షణీయమని మంథని సింగిల్ విండో చైర్మన్ కొత్త శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పీఏసీఎస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సందర్భంగా రైతులకు ఇచ్చిన హామీ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం విడుతల వారిగా రుణమాఫీ చేస్తున్నదన్నారు.మంథని కేడీసీసీబీ మేనేజర్‌గా పని చేస్తున్న దుమ్మని లక్ష్మణ్ మేడిపల్లి బ్రాంచ్‌కు బదిలీ వెళ్తుండగా, మంథని బ్రాంచ్ మేనేజర్‌గా ముత్తారం బ్రాంచ్ నుంచి బదిలీపై వచ్చిన మేనేజర్ కొంకటి ఉదయశ్రీలను పీఏసీఎస్ చైర్మన్ కొత్త శ్రీనివాస్ సన్మానించారు. వేర్వేరుగా జరిగిన కార్యక్రమాల్లో ఉపాధ్యక్షుడు బెల్లంకొండ ప్రకాశ్ రెడ్డి, డైరెక్టర్లు పాల్గొన్నారు.

పోలీస్ వాహనాల తనిఖీ

జ్యోతినగర్, జూలై 30: రామగుండం, ఎన్టీపీసీ ఠాణాల్లో మంగళవారం అడిషనల్ డీసీపీ అడ్మిన్ రాజు పోలీసు వాహనాలను తనిఖీ చేశారు. వాహన కండీషన్‌లను అడిగి తెలుసుకున్నారు. అలాగే పోలీసు సిబ్బంది వినియోగించే కంప్యూటర్స్, బ్లూకోల్ట్స్ ట్యాప్‌లను పరిశీలించారు. ఏఆర్ ఏసీపీ ప్రతాప్, గోదావరిఖని ఏసీపీ ఎం రమేశ్, ఎంటీవో మధు, రామగుండం సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐలు ఎస్ఐ కే సతీశ్, సమ్మయ్య, సిబ్బంది ఉన్నారు.

రోడ్డుపై వరి నాట్లు వేసి నిరసన

సుల్తానాబాద్,జూలై 30: ఇటీవల కురిసిన వర్షాలకు పట్టణంలోని 8వ వార్డు రోడ్డు బురదమయమైంది. మంగళవారం బీఆర్ఎస్ మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిప్పారపు కమల-దయాకర్ ఆధ్వర్యంలో మహిళలు రోడ్డుపై ఉన్న బురదలో వరి నాట్లు వేసి నిరసన వ్యక్తం చేశారు. సందర్భంగా మాజీ వ్యవసాయ మార్కెట్ చైర్మన్ తిప్పారపు కమల-దయాకర్ మాట్లాడారు. ఇప్పటికైన మున్సిపల్ అధికారులు పట్టించుకుని సుల్తానాబాద్ అభివద్ధికి తోడ్పడాలని వార్డు ప్రజలు, వారు కోరారు.

సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలి

పెద్దపల్లి టౌన్, జూలై30: అసెంబ్లీ సమావేశాల్లో శ్రీపోతులూరి వీరబ్రహ్మంగారి పట్ల అనుచిత వ్యాఖ్యలు చేసిన సీఎం రేవంత్ రెడ్డి విశ్వబ్రాహ్మణ సమాజానికి బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆ సంఘం నాయకుడు వంగల శ్రీకాంత్ డిమాండ్ చేశారు. పట్టణంలోని పైడబజార్‌లో రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాలని ఫ్లెక్సీలు కట్టాడు. విశ్వబ్రాహ్మణ సమాజం పట్ల సీఎం చిన్నచూపు చూస్తున్నారని మండిపడ్డారు. సీఎం క్షమాపణ చెప్పేదాకా నిరసన కొనసాగిస్తామని హెచ్చరించారు.

ఓసీపీ 5లో అవగాహన

గోదావరిఖని, జూలై 30: సింగరేణి ఆర్జీ-1 ఏరియా జీడీకె ఓసీపీ 5 గనిలో మంగళవారం ఆరోగ్య జాగ్రత్తలపై సింగరేణి ఏరియా దవాఖాన డిప్యూటీ సీఎంఓ డాక్టర్ ఆర్ కిరణ్‌రాజ్ ఆధ్వర్యంలో అవగాహన కల్పించారు. కంపెనీ ఆరోగ్య అధికారి డాక్టర్ సుమన్ కార్మికులకు అవగాహన కల్పించారు. ఇక్కడ గని మేనేజర్ అనిల్ గబలే, ఏఐటీయూసీ పిట్ సెక్రటరీ గుర్రం ప్రభుదాస్, సీఎంవోఏఐ ఏరియా ఆర్జీ-1 వైస్ ప్రెసిడెంట్ పెరుమాళ్ళ శ్రీనివాస్, సంక్షేమాధికారి ముహమ్మద్ ఫెరోజ్, ఇతర అధికారులు ఉన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

- మంథని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ రాజు

మంథని, జూలై 30: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని మంథని సీఐ బీ రాజు సూచించారు. మంథనిలోని ఆటో స్టాండ్‌లో ఆటో డ్రైవర్లతో సీఐ రాజు మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ట్రాఫిక్ నిబంధనలు, ప్రమాదాల నివారణకు చేపట్టాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది ఉన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణకు సహకరించాలి

ముత్తారం, జూలై 30: శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజలు పోలీసులకు సహకరించాలని మంథని సీఐ రాజు గౌడ్ కోరారు. మండల కేంద్రంలో ప్రజలతో మంగళవారం సమావేశమై మాట్లాడారు. గ్రామాల్లో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ముత్తారం ఎస్ఐ మధుసూదన్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య శిబిరం

కోల్‌సిటీ, జూలై 30: నగర పాలక సంస్థ 42వ డివిజన్ కార్పొరేటర్ బాల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో వైద్య శిబిరం నిర్వహించారు. అడ్డగుంటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ మనికేశ్వర్ రెడ్డి సహకారంతో కళ్యాణ్‌నగర్‌లోని వడ్ల సంఘం భవనంలో ఈ శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు దశరథం, ఏఎన్ఎం స్వప్న, సరస్వతి, పద్మ, సుజాత, సమైక్య అధ్యక్షురాలు రాజేశ్వరి, హేమలత పాల్గొన్నారు.

కాందిశీకుల సమస్యల పరిష్కారానికి కృషి

పెద్దపల్లి , జూలై30: బర్మా, శ్రీలంక కాందిశీకుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్ ప్రసాద్ లాల్ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బర్మా, శ్రీలంక కాందిశీకుల సమస్యల పరిష్కారంపై సమీక్షించారు. 30 ఏళ్ల కింద మూత పడిన అంతర్గాం స్పిన్నింగ్ మిల్లు, వీవింగ్ మిల్లు పడగా, అందులో పనిచేసిన వారి సమస్యలు, బకాయిలపై అదనపు కలెక్టర్ చర్చించి పలు సూచనలు చేశారు. ఆర్డీవో గంగయ్య, అంతర్గాం తహశీల్దార్ రమేశ్, కరీంనగర్ చేనేత జౌళి శాఖ సహాయ సంచాలకులు ఎస్ చరణ్, డీఎల్‌పీవో వేణుగోపాల్ ,అభివృద్ధి అధికారి చేనేత, జౌళి శాఖ అభివృద్ధి అధికారి కే శ్రీకాంత్ రెడ్డి, బర్మా శ్రీలంక కాందిశీకులు ప్రతినిధులు జే రామారావు, రవీందర్, కార్మిక నాయకుడు నరసింహ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

జ్యోతినగర్(రామగుండం), జూలై 30: తహసీల్ కార్యాలయా నికి వచ్చే సామాన్య ప్రజలతో మమేకంతో రెవెన్యూ సిబ్బంది వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలన్లి అదనపు కలెక్టర్ జీవీ శ్యామ్‌ప్రసాద్ లాల్ అన్నారు. రామగుండం తహసీల్ కార్యాలయాన్ని మంగళవారం సందర్శించారు. పెండింగ్ ధరణి సమస్యలు, భూసేకరణ తదితర అంశాలపై సమీక్ష జరిపారు. ఇక్కడ తహసీల్దార్ కుమారస్వామి, సిబ్బంది ఉన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

ముత్తారం, జూలై 30: దరియాపూర్ లోని మోడల్ స్కూల్, కాలేజీలో పీజీటీ కెమిస్ట్రీ పోస్టుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ రాజ్యలక్ష్మి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెస్సీ బీఈడీ చేసిన ఉత్సాహవంతులైన, ఆసక్తి అర్హత గల యువతీ యువకులు ఒరిజినల్ సర్టిఫికెట్స్ తో ఆగస్టు 1న కళాశాలలో సంప్రదించాలని హాజరు కావాలని కోరారు. ఉదయం 10 నుంచి సాయంత్రం 4గంటల వరకు డెమో క్లాసులు ఉంటాయని తెలిపారు.

లద్నాపూర్ భూ నిర్వాసితులతో సమావేశం

మంథని, జూలై 30: రామగిరి మండలం లద్నాపూర్ భూ నిర్వాసితులతో మంథని ఆర్డీవో హనుమానాయక్ మంగళవారం ప్రత్యేకంగా సమావేశమయ్యారు. గ్రామానికి చెందిన 283 మంది నిర్వాసితులకు సంబంధించిన కేసు హైకోర్టులో పెండింగ్‌లో ఉందన్నారు. గ్రామంలోని గృహాలకు మాత్రమే పరిహారం చెల్లించారని, ఆర్అండ్ఆర్ పరిహారం చెల్లించరాదని అవార్డులో అప్పటి భూ సేకరణ అధికారి రాశారని ఆర్డీవో తెలిపారు. దీనిపై సింగరేణి అధికారులు మాట్లాడుతూ.. లద్నాపూర్ నిర్వాసితులు కోరిన విధంగా ఆర్అండ్ఆర్ పరిహారం చెల్లించడానికి నిబంధనలు అనుమతించవన్నారు. ఎక్స్‌గ్రేషియాకు ఒప్పుకొని చెల్లింపులకు అనుమతిస్తే ఉన్నతాధికారులకు తెలియజేస్తా మన్నారు. కార్యక్రమంలో ఎస్‌వోటూ జీఎం రఘుపతి, ఏఎస్‌వో లక్ష్మీనారాయణ, జూనియర్ ఏస్టేట్ శ్యామల, లద్నాపూర్ గ్రామ కమిటీ సభ్యులు వనం రాంచందర్‌రావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

బాబా తాజుద్దీన్ ఉరుసు

మంథని, జూలై 30: మంథని బాబా తాజుద్దీన్ సేవా సమితి ఆధ్వర్యంలో సయ్యద్ మహమ్మద్ బాబా తాజుద్దీన్ రహమతుల్లా ఆలే నాగపూర్ 102వ ఉరుసు గంధం మహోత్సవాన్ని మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఊరేగింపుతో పాటు అన్నదాం ఏర్పాటు చేశారు.

కార్పొరేషన్ చైర్మన్‌కు సన్మానం

పెద్దపల్లి టౌన్, జూలై30: రాష్ట్ర ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ అయిత ప్రకాష్ రెడ్డిని కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రేగుంట అశోక్ గౌడ్ ఆధ్వర్యంలో సన్మానించారు. కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టి మంగళవారం జిల్లా కేంద్రానికి వచ్చిన ప్రకాష్ రెడ్డికి స్వాగతం పలికి సన్మానించారు. నాయకులు పాగాల శ్రీకాంత్, జడల సురేందర్, పైడా రవి, ఎరుకల రమేశ్, దేవనంది దేవరాజు, హకీం, అస్లాం, సిహెచ్. శ్రీనివాస్ రెడ్డి, నదీమ్ ఉన్నారు.

మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

ధర్మారం,జూలై30: విద్యార్థులు మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని పెద్దపల్లి సీఐ ఆర్ కృష్ణ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని సాధన జూనియర్ కళాశాలలో ధర్మారం పోలీసులు మత్తు పదార్థాలు,డ్రగ్స్,సైబర్ క్రైమ్‌లపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. గంజాయి,డ్రగ్స్‌తో ఆరోగ్యం దెబ్బతింటుందన్నారు. వాటికి దూరంగా ఉండి ఉజ్వల భవిష్యత్తును కాపాడుకోవాలని సూచించారు. ఎస్ఐ శీలం లక్ష్మణ్,పీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

కోల్‌సిటీ, జూలై 30: మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని జెండర్ స్పెషలిస్టు స్వప్న, ఫైనాన్స్ లిటరసీ స్పెషలిస్టు సంధ్యారాణి అన్నారు. గోదావరిఖని ద్వారకానగర్, గణేశ్ నగర్‌లో జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు నిర్వహించారు. అత్యవసర సమయంలో హెల్ప్ లైన్ నంబర్లు 181, 100, 112, 1098, 104, 155209లు వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు శరీన్, విష్ణుప్రియ, టీచర్లు పాల్గొన్నారు.

ఓపెన్ యూనివర్సిటీకి దరఖాస్తుల ఆహ్వానం

మంథని రూరల్, జూలై 30: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ డిగ్రీలో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ ఎండీ తాహీర్ హుస్సెన్, కో-ఆర్డినేటర్ కర్నాటి కృష్ణలు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ(బీఏ/బీకాం/బీఎస్సీ) కోర్సుల్లో 2024-25కు గాను ఆగస్టు 18 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. వివరాలకు www.braouonline.in,www.braou.ac.inవెబ్‌సైట్‌ను సందర్శించాలని సూచించారు. ద్వితీయ, తృతీయ సంవత్సరం విద్యార్థులు ట్యూషన్ ఫీజు చెల్లించాలని, డిగ్రీ 2015-16 నుంచి 2023-24 వరకు అడ్మిషన్ పొంది ఫీజు సకాలంలో చెల్లించని వారు కూడా ఆగస్టు 18లోపు ఫీజు చెల్లించాలన్నారు. వివరాలకు అధ్యయన కేంద్రంలో లేదా సెల్ నంబర్ 7382929649లో సంప్రదించాలన్నారు.

బస్సు యాత్రను జయప్రదం చేయండి

సుల్తానాబాద్,జూలై 30: తెలంగాణ లోని బొగ్గు బ్లాకులు సింగరేణికి కేటాయించాలని, బొగ్గు వేలాన్ని ఆపాలని సీపీఎం చేపట్టిన సింగరేణి పరిరక్షణ బస్సు యాత్ర వాల్ పోస్టర్లను మంగళవారం విడుదల చేశారు. బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరారు. నాయకులు ఎరవెల్లి ముత్యం రావు, మోదుంపల్లి శ్రావణ్, ప్రశాంత్ ఉన్నారు.

ఇన్‌చార్జి ఎంపీవోగా షబ్బీర్ పాషా

రామగిరి, జూలై 30: రామగిరి ఇన్‌చార్జి ఎంపీవోగా షబ్బీర్ పాషా నియమితులైనట్లు ఎంపీడీవో శైలజ తెలిపారు. ఓదెలలో ఎంపీవోగా పని చేస్తున్న షబ్బీర్ పాషా ఇన్‌చార్జి ఎంపీవోగా రామగిరి మండలంలో బాధ్యతలు చేపట్టారు.

800మెగావాట్ల పవర్‌ప్లాంట్ ఏర్పాటు చేయాలి

జ్యోతినగర్(రామగుండం), జూలై 30: రామగుండం లో 800మెగావాట్ల విద్యుత్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాగూర్ అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. మంగళవారం జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో ఎమ్మెల్యే మాట్లాడారు. నిజాం పాలనలో రెండు మెగావాట్లతో మొదలైన బీ పవర్‌హౌజ్ విద్యుత్ ప్లాంట్ నేడు 62.5మెగావాట్లకు అవతరించిందన్నారు. పాతకాలం నాటి ప్లాంట్‌తో ఏర్పడుతున్న సాంకేతిక సమస్యలతో ఇప్పుడు రామగుండం చీకటిమయమైందని, సబ్ సూపర్ క్రిటికల్ పవర్ ప్లాంట్ ఏర్పాటు చేయాలని గతంలో చేపట్టిన పోరాటాలను వివరించారు. పత్తిపాక రిజర్వాయర్‌తో పాటు ఎల్లంపల్లి, పాలకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వెంటనే ప్రారంభిస్తే రెండు ఉమ్మడి మండలాల్లోని సాగు భూములు సస్యశామలవుతాయన్నారు.

నేడు సదరం స్లాట్ బుకింగ్

పెద్దపల్లి, జూలై30: వైకల్య నిర్ధారణ పరీక్షల కోసం ఈనెల 31న ఉదయం 11:35 నుంచి మీ -సేవా కేంద్రాల్లో స్లాట్ బుక్ చేసుకోవాలని డీఆర్డీవో ఆర్ రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తగా సదరం సర్టిఫికెట్ కావాల్సిన వారు, తాత్కాలిక సదరం సర్టిఫికెట్ ఉన్నవారు రెన్యువల్ కోసం దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మానసిక వైకల్యం, బుద్ధి మాంద్యం ఉన్నవారికి ఆగస్టు 8న, దృష్టి, వినికిడి లోపం ఉన్న వారు ఆగస్టు 22న, శారీరక వైకల్యం గలవారు ఆగస్టు 1, 29న నిర్వహించే సదరం క్యాంపు లో హాజరయ్యేందుకు మీ సేవా కేంద్రంలో స్లాట్ బుక్ చేసుకోవాలని సూచించారు. క్యాంపులకు వచ్చే సమయంలో మీ -సేవ సదరం స్లాట్ బుకింగ్ రశీదుతో పాటు వైకల్య పరీక్ష కాపీ, ఆధార్ జిరాక్స్, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో, వ్యక్తిగత మెడికల్ రిపోర్టులు తీసుకు రావాలని సూచించారు.

పంచాయతీ కార్మికుల అరెస్ట్

కాల్వశ్రీరాంపూర్, జూలై30: సమస్యల పరిష్కారం కోసం ముఖ్యమంత్రికి వినతిపత్రం ఇవ్వడానికి హైదరాబాద్ తరలి వెళ్తున్న జీపీ సిబ్బందిని మంగళవారం ముందస్తుగా అదుపులోకి తీసుకొని ఠాణాకు తరలించారు. జీపీ కార్మికులకు రూ.20లక్షల బీమా ప్రకటించి, ప్రభుత్వమే ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని డిమాండ్ చేశారు. అరెస్టయిన వారిలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు మంద రాజేందర్, జీపీ సిబ్బంది అంబాల లక్ష్మణ్, మహేశ్, కలవేన గట్టయ్య, మెట్టు లక్ష్మణ్, ఆశ కార్యకర్తలు సునీత, గట్టమ్మ ఉన్నారు.

ధర్మారం, జూలై30: డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు బయలు దేరిన పంచాయతీ సిబ్బందిని స్థానిక పోలీసులు ముందస్తుగా అరెస్ట్ చేశారు. అరెస్టుకు నిరసనగా పంచాయతీల్లో సిబ్బంది విధులు బహిష్కరించినట్లు తెలిపారు.

పోలీసుల అదుపులో మధ్యాహ్న భోజన నిర్వాహకులు

మంథని, జూలై 30: తమ డిమాండ్ల సాధన కోసం హైదరాబాద్‌లోని ఇందిరాపార్క్ వద్ద ధర్నాకు వెళ్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులను మంగళవారం రాత్రి మంథని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జిల్లా అధ్యక్షుడు పూసాల రమేశ్ ఆధ్వర్యంలో మంథని ప్రాంతానికి చెందిన పలువురు మధ్యాహ్న భోజన నిర్వాహకులు హైదరాబాద్‌కు వెళ్లేందుకు బస్టాండ్‌కు రాగా, పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు.

కాంగ్రెస్ హామీలన్నీ నీటిమూటలే

పెద్దపల్లి టౌన్, జూలై30: అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ప్రజలకిచ్చిన హామీలన్నీ నీటిమూటలేనని బీజేపీ మండల అధ్యక్షుడు మేకల శ్రీనివాస్ విమర్శించారు. మంగళవారం స్థానిక అమర్ చంద్ కల్యాణ మండపంలో నిర్వహించిన మండల కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ వైఫల్యాలను ఎండగట్టాలన్నారు. కార్యక్రమంలో నాయకులు శిలారపు పర్వతాలు, ఆరుముళ్ల పోషం, దాడి సంతోష్, తంగేడ రాజేశ్వేర్ రావు, పోల్సని సంపత్ రావు తదితరులు పాల్గొన్నారు.

మిత్రుడికి సాయం

కమాన్‌పూర్, జూలై 30: మండల కేంద్రానికి చెందిన మార్త సుధాకర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడగా కమాన్‌పూర్ ఉన్నత పాఠశాల 1998-99 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు మంగళవారం రూ.18,500 సాయం అందజేశారు. నాయిని గంగాధర్, జాబు సతీశ్, మేడగోని విజయ్, పిట్టల తిరు పతి, పిడుగు సదయ్య, సాగర్ల రవి, అహ్మద్, మల్యాల తిరుపతి, పొన్నం రాజు, చాట్ల గట్టయ్య, జంగపల్లి విజయ్, సుమన్ ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో ఒకరికి జైలు

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 30: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ముగ్గురికి గోదావరిఖని సెకండ్ అడిషనల్ మేజిస్ట్రేట్ వెంకటేశ్ దుర్వ మంగళవారం ఒకరికి మూడు రోజుల జైలుశిక్ష విధించినట్లు రామగుండం ట్రాఫిక్ సీఐ పీ రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఇటీవల నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడిన 11మందిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపరుచగా వీరికి రూ. 22వేల జరిమాన విధించిన మేజిస్ట్రేట్ రెండోసారి పట్టుబడిన బామినీ భారత్ అనే వ్యక్తికి మూడు రోజుల జైలుశిక్ష విధించడంతో కరీంనగర్ జైలుకు తరలించినట్లు సీఐ వివరించారు.

ప్రమాద రహిత డ్రైవర్లకు సన్మానం

ఫర్టిలైజర్‌సిటీ, జూలై 30: ఆర్టీసీ ప్రమాద రహిత వారోత్సవాల ముగింపు సందర్భంగా మంగళవారం గోదావరిఖని ఆర్టీసీ డిపోకు చెందిన డ్రైవర్లు ఆర్‌కె మూర్తి, కే భూమయ్య, ఎస్ తిరుపతి 29 సంవత్సరాలుగా విధుల్లో ఎలాంటి అక్సిడెంట్ చేయలేదు. దీంతో వారిని ప్రశంసిస్తూ రామగుండం ట్రాఫిక్ సీఐ రాజేంద్రప్రసాద్ డ్రైవర్లను శాలువలతో సన్మానించారు. ఇక్కడ ట్రాఫిక్ ఎస్ఐ హరిశేఖర్, ఆర్టీసీ డిపో మేనేజర్ నాగభూషణం, అసిస్టెంట్ మేనేజర్ కే గీతాకృష్ణ, అసిస్టెంట్ ఇంజినీర్ ఎం సంధ్యారాణి, డిప్యూటీ సూపరింటెండెంట్ కే సదానందనం, ఎంప్లాయీస్ వెల్ఫేర్ బోర్డు సభ్యులు టీ స్వామి, వీ ఇందిరాదేవి ఉన్నారు.

అరుదైన వ్యాధితో యువకుడి మృతి

ముత్తారం, జూలై 30: లక్కారం గ్రామానికి చెందిన నాయిని రాజిరెడ్డి, సుజాతల కుమారుడు ధర్మతేజ (22) యువకుడు అరుదైన వెన్నెముక వ్యాధితో బాధపడుతూ మంగళవారం మృతి చెందాడు. వివరాలిలా ఉన్నాయి. కొన్ని నెలలుగా వెన్నెముక వ్యాధితో బాధపడుతున్న ధర్మతేజకు కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో 8నెలలుగా చికిత్స అందిస్తున్నా ఫలితం లేకపోయింది. శనివారం ఆస్పత్రి నుంచి ఇంటికి పంపించారు. ఇంటికి వచ్చిన మూడు రోజుల తర్వాత మంగళవారం ధర్మ తేజ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఒక్కగానొక్క కొడుకు మృతితో తల్లిదండ్రులు రోదనలు మిన్నంటాయి.

గ్రామాలను శుభ్రంగా ఉంచుకోవాలి

మంథని రూరల్, జూలై 30: గ్రామాలను శుభ్రంగా ఉంచుకునేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని డీఎల్పీవో సతీశ్ సూచించారు. గద్దలపల్లి గ్రామాన్ని మంగళవారం సందర్శించారు. గ్రామంలో శానిటేషన్ పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అధికారులు, సిబ్బందికి పలు సూచనలు చేశారు..

నియామకం

జూలపల్లి, జూలై 30 : వెంకట్రావ్‌పల్లి గ్రామానికి చెందిన వేల్పుల సతీశ్‌రావు జాతీయ వినియోగదారుల హక్కుల కమిషన్ జిల్లా చైర్మన్‌గా నియమితులయ్యారు. ఈ మేరకు సంస్థ రాష్ట్ర చైర్మన్ డాక్టర్ నలమాస శ్రీకాంత్‌గౌడ్ నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సతీశ్‌రావు రాష్ట్ర చైర్మన్‌తోపాటు, జాతీయ చైర్మన్ నాగేశ్వర్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED
CHANGE OF NAME
I, MOHAMMED RAHMAN, R/o. H.No. 5-44, Vill: Buggaram, Mandal: Buggaram, Dist: Jagityal, TS. Changed My Name to MAHAMMAD ABDUL RAHAMAN, S/o. Mohammad Rasul.
NT-331214

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
Cell: 91827 77571
91827 77194